వక్ఫ్ చట్ట సవ'రణం'

వక్ఫ్ చట్ట సవరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లు చర్చనీయాంశంగా మారింది. వక్ఫ్ ఆస్తులపై కేంద్ర, రాష్ట్ర బోర్డులకు ఉన్న హక్కులను కట్టడి చేసే దిశగా తెస్తున్నట్లుగా చట్టసవరణ బిల్లు ఉందని ముస్లిం వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న ఈ బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు సైతం తమ మద్దతును ప్రకటించలేదు. కానీ ఈ వివాదాస్పద బిల్లు అమల్లోకి వస్తే జరిగే పరిమాణాలపై టీడీపీ కనీస ఆలోచన చేయకుండా పొత్తులో భాగంగా ఏకపక్షంగా మద్దతు తెలపడంపై ముస్లిం మైనార్టీలు మండిపడుతున్నారు. -సాక్షి నెట్‌వర్క్

గొంతుకోయాలని చూడడం దారుణం



మైనార్టీల మనుగడను ప్రశ్నార్థకంగా చేసే కుట్రలో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలిపి ముస్లింల గొంతు కోయాలని చూడటం దారుణం. టీడీపీ వెంటనే తన మద్దతు ఉపసంహరించుకోవాలి. బిల్లుపై ఆలోచన చేసి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం ప్రశంసనీయం.

-ఎస్‌కే రసూల్, దగదర్తి

పొత్తు కోసం దిగజారుతారా ?



వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలపడం సరికాదు. కేంద్రంతో పొత్తు, స్వప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారుతారా? ముస్లింలను శత్రువులుగా చూస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును ఖండించాల్సిన టీడీపీ అందుకు భిన్నంగా మద్దతు తెలిపి రాష్ట్రంలోని ముస్లింలకు వ్యతిరేకంగా మారింది.

-షేక్ షబ్బీర్, కావలి

మత సామరస్యతను దెబ్బతీయడమే



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవర బిల్లు మైనార్టీల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మత సామరస్యతను దెబ్బతీసేలా ఉంది. మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటు. లౌకికవాదిగా చెప్పుకునే చంద్రబాబుకు ముస్లింల పట్ల ఉన్న వైఖరి స్పష్టమైంది.

- రసూల్,గండిపాళెం

ఏకపక్షంగా వ్యవహరిస్తోంది



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. వక్ఫ్ చట్ట సవరణలకు పూనుకోవడం ద్వారా మత సామరస్యాన్ని దెబ్బతీయాలని చూస్తోంది. దీన్ని అన్ని రాజకీయ పక్షాలు ఖండించాలి. బిల్లుకు మద్దతు తెలిపినా ఎన్డీఏ పక్షాలు వెంటనే ఉపసంహరించుకోవాలి.

షేక్ రియాజ్, మర్రిపాడు

మైనార్టీలను అర్థం చేసుకోవాలి



దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు మైనార్టీల సంక్షేమాన్ని, వారి హక్కులను అర్థం చేసుకోవాలి. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలి. కేంద్ర ప్రభుత్వానికి భయపడి టీడీపీ వంటి కొన్ని పార్టీలు బిల్లుకు మద్దతు పలకడం దారుణం. వారు మరోసారి ఆలోచించాలి.

- షేక్ కరీముల్లా, తలుపూరుపాడు, సంగం

స్వప్రయోజనాల కోసం మద్దతు తగదు



దేశంలో త్వరలో కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాసేందుకు వక్ఫ్ చట్ట సవరణలకు పూనుకోవడం మంచి పద్ధతికాదు. మత సామరస్యాన్ని దెబ్బతీసే ఇలాంటి వైఖరిని అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలి.

- షేక్ ఖాజామునీర్, చేజర్ల

టీడీపీ మద్దతు ప్రకటించడం దారుణం



దేశంలోని మైనార్టీలను బలహీనపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. మసీదులు, దర్గాలకు సంబంధించిన ఆస్తులపై పెత్తనం చేసేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న వివాదాస్పద బిల్లుకు టీడీపీ మద్దతు ప్రకటించడం దారుణం. మైనార్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన టీడీపీ వ్యతిరేకంగా ప్రవర్తించడం గర్హనీయం.

- ఉస్మాన్ షరీఫ్, అల్లూరు

బిల్లుకు మద్దతు సరికాదు



ముస్లిం మైనార్టీలను ఆత్మరక్షణలో పడేసేలా కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలపడం విచారకరం. బిల్లు అమల్లోకి వస్తే జరిగే పరిమాణాలపై కనీస ఆలోచన చేయకుండా పొత్తులో భాగంగా ఏకపక్షంగా మద్దతు తెలపడం దారుణం. టీడీపీ వెంటనే మద్దతు ఉపసంహరించుకోవడంతో పాటు ముస్లింలకు భేషరుతుగా క్షమాపణ చెప్పాలి.

- షేక్ రవూఫ్, కావలి

టీడీపీ క్షమాపణ చెప్పాలి



దేశంలోని మైనార్టీలను బలహీనపరచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. మసీదులు, దర్గాలకు సంబంధించిన ఆస్తులపై పెత్తనం చేసేలా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న వివాదాస్పద బిల్లుకు టీడీపీ మద్దతు ప్రకటించడం దారుణం. మైనారీలకు క్షమాపణ చెప్పి మద్దతును ఉపసంహరించుకోవాలి.

-షేక్ రఫీ, ఆత్మకూరు

అంబేడ్కర్ మహాశిల్పం ధ్వంసం హేయం

గత ప్రభుత్వ హయాంలో విజయవాడలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని పచ్చ మూకలు ధ్వంసం చేయడంపై జిల్లా వాసులు భగ్గుమన్నారు. ఎన్నికల సమయంలో దళితులను వాడుకుని అధికారంలోకి వచ్చాక ఇలా వ్యవహరించడంపై మండిపడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి ఇది ఓ నిదర్శనమంటున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. కాగా ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆధ్వర్యంలో బోగోలులో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధ్వంసానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ సుజాత, జెడ్పీటీసీ కీర్తన, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. -సాక్షి నెట్‌వర్క్



బోగోలులో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి



విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని టీడీపీ మూకలు ధ్వంసం చేయడం అమానుషం. ఈ ఘటనను అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులు పట్టించుకోకుండా రాజ్యాంగాన్ని పరిహసించేలా వ్యవహరించడం సరికాదు.

- కే విల్సన్ కుమార్, ఆత్మకూరు

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం అమానుషం



భారత రాజ్యాంగ నిర్మాత విగ్రహ ధ్వంసం అమానుషం. గత ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాతను గౌరవిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు టీడీపీ మూకలు యత్నించడం క్షమించరాని విషయం. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

-తానికొండ నరసింహులు, మండల ఎస్సీ, ఎస్టీ సంఘం అధ్యక్షుడు, చేజర్ల

రాజకీయాలకు అతీతులు అంబేడ్కర్



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రాజకీయాలకు అతీతులు. ఆయన చూపిన మార్గంలో నడిచి ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. అలాంటి మహానుభావుని విగ్రహాన్ని టీడీపీ మూకలు ధ్వంసం చేయడం క్షమించరాని నేరం. ఈ ద్రోహాన్ని చూస్తూ టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణం.

- టీ దామోదర్‌రావు, అంబేద్కరిస్ట్, అనంతసాగరం

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదు



విజయవాడలో అంబేడ్కర్ మహాశిల్పాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి పాల్పడడం సరికాదు. అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు నిత్యస్మరణీయుడైన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించినా అధికారులు, పోలీసులు మౌనంగా ఉండడం విస్మయానికి గురిచేసింది. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందానే అనుమానాలు తలెత్తుతున్నాయి.

- శ్రీనివాసులు, దగదర్తి

దేశమంతా ఏకమవుతుంది



రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూస్తే దేశమంతా ఏకమవుతుంది. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమల్లో ఉన్న దేశంలో అదే అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని చూడడం దారుణం. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

-కరుణాకర్, అల్లూరు

ప్రతిఒక్కరూ ఖండించాలి



విజయవాడలో అంబేడ్కర్ న్యాయ మహాశిల్పాన్ని ధ్వంసం చేసేందుకు అల్లరి మూకలు పాల్పడడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి. పార్టీలతో సంబంధం లేకుండా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ప్రతిఒక్కరూ గౌరవిస్తారు. అలాంటి వ్యక్తి విగ్రహం ధ్వంసం చేసేందుకు అల్లరి మూకలు యత్నిస్తున్నా అధికారులు తమకేమి పట్టనట్లుగా ఉండడం దారుణం. నిందితులను గుర్తించి శిక్షించాలి.

- ఉల్లాది నరసింహులు, సంగం

క్షమించరాని నేరం



అంబేడ్కర్ మహాశిల్పం దాడి క్షమించరానిది. రాత్రి వేళ పోలీసుల సాక్షిగా మహాశిల్పాన్ని ధ్వంసం చేయాలనే టీడీపీ మూకలు ప్రయత్నించడం దారుణం. రాజ్యాంగ నిర్మాతకు గత ప్రభుత్వం తగిన గౌరవం ఇచ్చి భారీ విగ్రహం ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయడం ఏమిటి? భవిష్యత్తులో టీడీపీ తగిన మూల్యం చెల్లించకోక తప్పదు.

- ఎలీషా కుమార్,సీతారామపురం

అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ కరువైతే ఎలా



కూటమి ప్రభుత్వంలో అంబేడ్కర్ విగ్రహానికే రక్షణ కరువైంది. దళితుల ఆరాధ్య దైవమైన అంబేడ్కర్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకుని కొంతమంది ఉన్మాదంతో చెలరేగిపోవడం క్షమించరాని నేరం. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా దళితులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలి.

- యలపల తిరుపాలు, పోలంపాడు, కలిగిరి మండలం

రాజ్యాంగంపైన దాడి



అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం అంటే ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపైన దాడి చేసినట్టే. అధికార మదంతో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ద్వారా దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించబోం.

- పవన్, కావలి

క్లుప్తంగా

ఆర్వో ప్లాంట్ ప్రారంభం




వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని కొత్తూరులో రిలయన్స్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆ సేవా సమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్లాంట్ నిర్మాణం వెనుక తమ సేవా సమితి ప్రతినిధులు వెంకటరామిరెడ్డి, ధరణి కృషి ఎంతో ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో పది ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో కార్పొరేట్ సంస్థల సీఆర్ఎఫ్ నిధులతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జనపనార సంచులు, చెత్తకుండీలను ప్రజలకు అందజేస్తున్నట్లు తెలిపారు. వివిధ పార్టీల నేతలు గణపం బాలకృష్ణారెడ్డి, గూడ నర్సారెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, విజయకుమార్, గణపం రమేష్‌రెడ్డి, రేవనూరు శ్రీనివాసరెడ్డి, యల్లాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు నూతన సీఐగా జీ గంగాధర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సీఐను సర్కిల్ పరిధిలోని పలువురు ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైలు ముత్యాలరావు, విశ్వనాథరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కావలి సీఐగా మహమ్మద్ ఫిరోజ్



కావలి : కావలి ఒకటో పట్టణ స్టేషన్ సీఐగా మహమ్మద్ ఫిరోజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలిగిరి సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కావలి వచ్చారు.

సన్మానం

అనుమసముద్రంపేట : మండలంలోని పాఠశాలల్లో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో గెలుపొందిన చైర్మన్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు పులిమి వెంకటరమేష్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా కమిటీ ఎన్నికల్లో సైతం టీడీపీ ఎన్నో కుట్రలు చేసిందని, వాటిని అధిగమించి వైఎస్సార్సీపీ మద్దతుదారులు ఎన్నికల్లో విజయం సాధించడం అభినందనీయమన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



కావలి : మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, యువత వాటికి దూరంగా ఉండాలని కావలి అడిషనల్ జూడిషియల్ మేజిస్ట్రేట్ జీ విక్రం సిన్హా, స్పెషల్ మేజిస్ట్రేట్ వై పరుసురాం సూచించారు. మండల న్యాయ సేవాధికారక సంస్థ అధ్వర్యంలో పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సుకు జడ్జిలు ముఖ్యఅతిథులుగా హాజరై మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది కెనడి, లీగల్ ఎయిడ్ మెంబర్ సాయిప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ మాలకొండారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రిన్సిపల్ వలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ప్రారంభం



చేజర్ల: మండలంలోని ఎన్వీకండ్రికలో ఉన్న శ్రీపెనుశిలలక్ష్మీనరసింహ ఉద్యాన రైతు సంఘం, హార్టీకల్చర్ కలెక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాన్ని శుక్రవారం ప్రారంభించారు. నాబార్డ్ డీడీఎం బాబు ముఖ్యఅతిథిగా హాజరై ఎరువుల దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు అందించాలన్నదే ఎఫ్‌పీఓ ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినయోగం చేసుకోవాలన్నారు. సీబీబీఓ సోషల్ మొబిలైజర్ నాగలక్ష్మి ఎఫ్‌పీఓ చైర్మన్ తేళ్ల ఆదిశేషారెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బర్త్,డెత్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ పరిశీలన



కావలి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కావలి మున్సిపల్ కార్యాలయంలో బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ ప్రక్రియను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ వై సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి శుక్రవారం పరిశీలించారు. సర్టిఫికెట్లు జారీ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్లు కీలక పాత్ర

కావలి: దేశాభివృద్ధిలో ఇంజనీర్లది కీలక పాత్ర అని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. మద్దూరుపాడులోని డీబీఎస్ కళాశాల ఆవరణలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్‌లో నూతనంగా చేరిన విద్యార్థులు ప్రథమ సంవత్సరం నుంచే లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. కష్టపడి చదివి మంచి ఉద్యోగావకాశాలను పొందాలని కాంక్షించారు. కళాశాల కరెస్పాండంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు, ప్రిన్సిపల్ టీవీ రావు , పరిపాలనాధికారి జీ రమేష్‌బాబు , అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని బతికించాలి

ఆత్మకూరు: వ్యవసాయ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయని, వాటిని నిలిపివేసి ఆ రంగాన్ని బతికించాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ క్విట్ కార్పొరేట్ పేరుతో దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాలు చేపడుతున్న ఆందోళనలో భాగంగా ఆత్మకూరులో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక, రైతు సంఘాల నాయకులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. దేశంలో రూ.65 లక్షల కోట్ల లావాదేవీలు వ్యవసాయ, ఆహార రంగంలో జరుగుతున్నాయన్నారు. వాటిని ప్రైవేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్రం కుటిల ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిగా క్విట్ కార్పొరేట్ ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు.



ఆత్మకూరులో రైతుల నిరసన ప్రదర్శన

ఉదయగిరి: క్విట్ కార్పొరేట్ ఆందోళనల్లో భాగంగా సీపీఎం నేతలు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. స్వామినాథన్ కమీషన్ సూచనల ప్రకారం వివిధ పంటలకు మద్దతు ధరను కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందించాలని కోరారు.

14న మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్ శుక్రవారం తెలిపారు. మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి : విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతుల దృష్ట్యా కావలి పట్టణం, మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని డీఈఈ శ్రీనివాసులురెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై వసంతరావు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మర్రిపాడు: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ స్వప్న హెచ్చరించారు. గురువారం మర్రిపాడులోని ఇసుక రీచ్‌ను సందర్శించిన తహసీల్దార్ సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై శుక్రవారం వారిని కార్యాలయానికి పిలిపించి హెచ్చరించారు. మర్రిపాడు ఇసుక రీచ్ వద్ద విధులు కేటాయించిన సిబ్బంది తప్పని సరిగా నిర్వర్తించాలన్నారు. అక్రమాలకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ రాజానారాయణ ఉన్నారు.

సమస్యలపై నిలదీత

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంపై పలువురు వార్డు సభ్యులు సర్పంచ్ సృజనపై మండిపడ్డారు. వింజమూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. పంచాయతీకి వస్తున్న సాధారణ, ఆర్థిక సంఘం నిధులను ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్తూరులో నీటి సమస్య, బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, నడిమూరులో పూడిపోయిన డ్రైనేజీలు, తదితర సమస్యలపై సభ్యులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు.ఎస్టీకాలనీలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంపై ఎంపీటీసీ భవానీ నిలదీశారు. త్వరలో సమస్యలు పరిష్కారిస్తామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సర్ది చెప్పారు.

ఏటీఎం కార్డు మార్చేసి...

- బ్యాంకు ఖాతాలోని నగదు మాయం

ఉదయగిరి: ఉదయగిరిలోని స్టేట్ బ్యాంకులో ఉన్న ఏటీఎం వద్దకు వచ్చిన ఓ వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి ఏ మార్చి ఏటీఎం కార్డును తీసుకుని ఖాతాలోని నగదు మాయం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని పుల్లాయపల్లికి చెందిన జే గురునారాయణ తన కొత్త ఏటీఎం కార్డుకు పిన్ కోడ్ జనరేట్ చేసుకునేందుకు ఉదయగిరిలోని స్టేట్ బ్యాంకులో ఉన్న ఏటీఏం వద్దకు వచ్చాడు. అతనికి పిన్‌కోడ్ జనరేట్ చేసుకునే విధానం తెలియకపోవడంతో అక్కడ ఉన్న ఓ వ్యక్తిని సాయం అడిగాడు. ఇదే అదనుగా అక్కడ ఉన్న గుర్తుతెలియని వ్యక్తి నేను కూడా అదే పని మీద వచ్చానని నమ్మబలికాడు. అనంతరం తన వద్ద ఉన్న కార్డును గురునారాయణకు ఇచ్చి అతని కార్డు తీసుకున్నాడు. వెంటనే పక్కనే ఉన్న పెట్రోల్ బంకులో రూ.4,500కు పెట్రోలు పోయించుకున్నాడు. అనంతరం దుత్తలూరు ఏటీఎంలో రూ.40వేలు డ్రా చేశాడు. తన ఖాత నుంచి నగదు డ్రా అయినట్లు సెల్‌కు మెసేజ్ రావడంతో గమనించిన గురునారాయణ మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి రంగంలోకి దిగి ఉదయగిరి, దుత్తలూరు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణంలోని మార్పులు పంటలపై ప్రభావం

మర్రిపాడు: వాతావారణంలో వస్తున్న మార్పులు పంటలపై ప్రభావం చూపుతాయని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతిదేవి తెలిపారు. మండలంలోని పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల్లోని రైతులకు సాగులో వైవిద్యంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలకు తెగుళ్లు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. విచక్షణా రహితంగా రసాయన మందులు వాడడం వల్ల వాతావరణ, భూ కాలుష్యం ఏర్పడుతాయని తెలిపారు. అంతర పంటల సాగు, సేంద్రియ, సమతుల ఎరువుల వాడకం, సమగ్ర సస్య రక్షణ చర్యలను రైతులు పాటించాలన్నారు. సుస్థిర ఆదాయం పొందేందుకు మిశ్రమ వ్యవసాయం, ఉద్యాన పంటల సాగు, పశుగ్రాసాలు, పెరటి కూరగాయల సాగు, కోళ్ల పెంపకం చేపట్టాలని సూచించారు. ఏఓ రామ్మోహన్, ఉద్యాన అధికారి సీహెచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మారుతిదేవి

భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

సోమశిల: అనంతసాగరంలోని టీజేఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల ఏర్పాటుకు హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, కోలా ఓబయ్య, కోలా పెంచలయ్య చారిటబుల్ ట్రస్టు సహకారంతో భోజనశాల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ రాధమ్మ, ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హెచ్‌ఎం, చైర్మన్

సొసైటీ ట్రాక్టర్ పరికరాలు చోరీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సహకార పరపతి సంఘానికి సంబంధించిన ట్రాక్టర్ పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని సొసైటీ సీఈఓ మేకల రమణయ్య తెలిపారు. సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2008లో వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో సొసైటీకి ట్రాక్టర్ మంజూరైందని తెలిపారు. ఇటీవల ట్రాక్టర్ మరమ్మతులకు గురవడంతో సొసైటీ కార్యాలయ ఆవరణంలో ఉంచామని చెప్పారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ పరికరాలు చోరీ అయ్యాయని, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించి రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.